# కేశవపూర్ ప్రాజెక్ట్‌తో 24 గంటలు నీళ్లు



జమాల్‌బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు

## ● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వం కేశవపూర్ ప్రాజెక్ట్‌తో గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాలకు త్వరలో 24 గంటల పాటు 50 టీఎంసీల నీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల కంటే అంబర్‌పేటను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. గత పాలకులు అంబర్‌పేట నియోజకవర్గంలో మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు, రోడ్లసమస్యలను పట్టించుకోలేక పోవడంతో ప్రస్తుతం అనేక సమస్యలు పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. కాచిగూడ డివిజన్ జమాల్‌బస్తీలో రూ.18 లక్షలతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్, అదే విధంగా మనియార్‌పట్టి బస్తీలో రూ.20 లక్షలతో నూతన డ్రైనేజీ పనులను శనివారం కాచిగూడ కార్పొటర్ ఉమాయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు ప్రారంభించారు. అనంతరం జమాల్‌బస్తీ నుంచి పాదయాత్రగా బయలుదేరి మనియార్‌పట్టి బస్తీ వరకు ఎమ్మెల్యే స్థానికుల నుంచి పలు సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు, రోడ్లను వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గం ప్రజల కనీస అవసరాలైన మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో స్థానికులను ప్రధానంగా వేధిస్తున్న నీటి కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారంతో పాటు బస్తీ, కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సౌకర్యార్థం కోసం నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, బి.కృష్ణాగౌడ్, డాక్టర్ శిరీషాయాదవ్, మడిశెట్టి ప్రతిభ, బద్దుల ఓం ప్రకాశ్‌యాదవ్, దాత్రిక్ నాగేందర్‌బాబ్జి, సుభాష్‌పటేల్, కృష్ణకుమార్, మన్నె శ్రీనివాస్‌యాదవ్, మహేశ్‌కుమార్, శ్రీకాంత్‌యాదవ్, బబ్లూ, అంటోని, భీంరాజ్, రవియాదవ్, బబ్బి పాల్గొన్నారు.

## రోడ్డు పనులను తొందరగా పూర్తి చేయాలి



బుర్జుగల్లీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, అక్టోబర్ 7: బాగ్అంబర్‌పేట డివిజన్ బుర్జుగల్లిలో రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆమె వర్క్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతతో మంచిగా రోడ్డు నిర్మాణం జరగాలని సంబంధిత కాంట్రాక్టర్, వర్క్ ఇన్స్‌పెక్టర్ కు చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, డివిజన్‌లో ఇంకా పెండింగ్‌లో ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, టి.రమేశ్, కెంచె మహేశ్, జె.బాలరాజు, మిర్యాల శ్రీను, రమేశ్‌ముదిరాజ్, శేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేరింది..



డబుల్‌బెడ్రూమ్ పట్టాతో భర్త రమేశ్‌తో మహేశ్వరి

కాచిగూడ, అక్టోబర్ 7: ఎట్టకేలకు సీఎం కేసీఆర్ పుణ్యమా అని సొంతింటి కల నెరవేరిందని బాగ్అంబర్‌పేట ప్రాంతానికి చెందిన డబుల్‌బెడ్రూమ్ గ్రహీత మండ్ల మహేశ్వరి సంతోషాన్ని వ్యక్తం చేసింది. 2016 సంవత్సరంలో డబుల్‌బెడ్రూమ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఫోన్ చేసి అమ్మ మీకు లాటరీలో డబుల్‌బెడ్రూమ్ వచ్చింది, త్వరలో మీ దగ్గరకు మా అధికారులు వస్తారని చెప్పగానే నాకు ఎంతో సంతోషం కలిగింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దయతో టిఫిన్ పెట్టి, బస్సులో రాంపల్లికి తీసుకెళ్లి ఇల్లు కేటాయించడంతో నా జీవితం ధన్యమైంది. ఇప్పుడు మాఇంటి కిరాయి. రూ.5 వేలు. నా భర్త రమేశ్ చెత్తబండి నడిపిస్తాడు. కొన్నేండ్లుగా నేను ఇండ్లల్లో పని చేసుకుంటున్నా. నాకు డబుల్‌బెడ్రూమ్ రావడంతో నాలో ఆత్మగౌరవం పెరిగింది. సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ఇప్పటి నుంచి నాకు నెలానెలా ఇంటికిరాయి చెల్లించే బాధ తప్పింది.

# వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్క మైనార్టీ తన ఓటును వినియోగించుకోవాలి

● 400 మంది ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 7: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో ముస్లింలు తమ ఓటు హక్కును సంపూర్ణంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. పోలింగ్ రోజు ప్రతి ఒక్క ముస్లిం ఇంటి నుంచి బయటకు వచ్చి తమ ఓటును వేయాలన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ముస్లిం మహిళలకు మంజూరైన 400 కుట్టు మిషన్లను అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో గల తజ్వీదుల్ ఖురాన్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో కార్పొరేటర్లు ఇ.విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా సమాజంలో గౌరవం పెంచుతున్నారన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం తాము కట్టుబడి పని చేస్తున్నామని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కుట్టు మిషన్లు పొందిన లబ్ధిదారులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమకు అందించిన కుట్టు మిషన్ల సాయంతో మంచి ఉపాధిని కలిగించుకొని జీవితాలను మెరుగుపర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అఫ్రోజ్‌పటేల్, అతీఖ్, సలీం, అఖిల్, సాహెద, సంతోష్‌చారి పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి రైల్వే ఉద్యోగి మృతి

కాచిగూడ,అక్టోబర్ 7: తుంగభద్ర రైలు దిగుతుండగా జారిపడి రైల్వే ఉద్యోగి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన వెంకట్రావ్ కుమారుడు లలిత్ కౌశిక్(30) కర్నూల్‌లోని కల్పతరువు రైల్వే ప్రాజెక్ట్‌లో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో లలిత్ కౌశిక్ తుంగభద్ర రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు రైల్లోంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వాడి రైల్లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి

కాచిగూడ, అక్టోబర్ 7: వాడి రైల్లో వృద్ధుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(70)శనివారం ఉదయం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–2లో అగిన వాడి రైల్లోని జనరల్ బోగిలో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్

## బతుకమ్మ చీరలు పంపిణీ..

కాచిగూడ, అక్టోబర్ 7: కుల, మతాలకు అతీతంగా తెలంగాణలో బతుకమ్మ పండుగను జరుపుకుంటారని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆమె కాచిగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్‌తో కలిసి మోతీలాల్ నెహ్రూనగర్ కమ్యూనిటీ హల్‌లో చేపట్టారు. కన్నె రమేశ్‌యాదవ్, యూసీడీ అధికారి శ్రీనివాస్, సుభాష్‌పటేల్, నాగేందర్‌బాబ్జి, బీంరా జ్, బబ్లూసింగ్, రవియాదవ్ పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరండి

అంబర్‌పేట, అక్టోబర్ 7: తెలంగాణ ముదిరాజ్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభకు తెలంగాణ రాష్ట్రం నుంచి ముదిరాజ్‌లు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పుట్టియాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం అంబర్‌పేటలోని సంఘం కార్యాలయంలో సంఘం సలహాదారులు తూర్పు యాదగిరిముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సి. నవీన్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు డొప్ప అంజయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వి.బాలరాజ్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు ఎం. శ్రీరాములుముదిరాజ్, రోహిత్ ముదిరాజ్, యువ ప్రవీణ్, సిద్ధార్థ్ ముదిరాజ్, సి. సత్యనారాయణ ముదిరాజ్‌లు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లు కేటాయించాలన్నారు.

## పైసా ఖర్చు లేకుండా డబుల్ బెడ్రూమ్ ఇచ్చారు



డబుల్‌బెడ్రూమ్ పట్టాతో భర్త అశోక్‌తో పల్లేరుల శోభ

కాచిగూడ, అక్టోబర్ 7: పైసా ఖర్చు లేకుండా డబుల్‌బెడ్రూమ్ ఇచ్చారు. కేసీఆర్ సారుతోనే ఇది సాధ్య మైందని డబుల్‌బెడ్రూమ్ లబ్ధిదారు కాచిగూడలోని బాలప్పబాడ ప్రాంతానికి చెందిన పల్లేరుల శోభ సంతోషాన్ని వ్యక్తం చేసింది. 34 ఏండ్ల తరువాత ఎట్టకేలకు సొంతింటి కల నెరవేరింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక మార్లు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకొని, దళారులకు వేల రూపాయలు ఇచ్చాను, డబ్బులు పోయినవి కాని, ఇల్లు మాత్ర రాలేదు. 2016 సంవత్సరంలో డబుల్‌బెడ్రూమ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నిండు హృదయంతో దయతలచి ఎట్టకేలకు మాకు తూమ్‌కుంటలో సొంతింటి కలను నెరవేర్చాడు. దీంతో సీఎం కేసీఆర్‌కు జీవితాం తం రుణపడి ఉంటాం. ఇంటి కిరాయి ప్రతినెలా రూ. 6,500లు చెల్లించే వాళ్లం ఇప్పుడు ఆ బాధ తప్పింది. బుల్‌బెడ్రూమ్ రావడంతో ఆత్మగౌరవం పెరిగింది. సీఎం కేసీఆర్‌సార్‌కు రుణపడి ఉంటాం.